# భైరవి

మణి నిర్మలప్రభావతి



డాక్టర్ పద్మావతీ ప్రైవేటు నర్సింగ్ హోంలో, మేడమీద విశాలంగా, విడిగావున్న స్పెషల్ రూంలో, కిటికీ దగ్గర నిల్చుని, దూరంగా రోడ్డుమీద వెళ్తున్న బస్సులనూ, రిక్షాలనూ చూస్తోంది భైరవి. ఆ వెళ్తున్న జనంలో కలిసి తనూ మామూలుగా నడిచి వెళ్లాలనీ, ఏ ప్రత్యేకతా లేకుండా, ఏ అరలూ, తెరలూ లేకుండా జీవించగలిగితే బావుండుననీ ఆమె మనస్సెందుకో ఘోషపెడుతోందీ రోజు...

గదితలుపు మెల్లిగా తట్టిన చప్పుడు కావటంతో, తిరిగి చూచింది భైరవి. డాక్టర్ పద్మావతి చిరునవ్వుతో విష్ చేస్తూ గుమ్మంలో నిల్చుని వుంది.

"ఎలా వున్నారమ్మా? రాత్రి బాగా నిద్రపట్టిందా?" అంటూ లోపలికి వచ్చి బెడ్‌దగ్గరగావున్న గార్డెన్ ఛేర్‌లో కూర్చుంది డాక్టర్ పద్మావతి.

"ఆ!" అంది భైరవి చిరునవ్వు నవ్వుతూ బెడ్‌మీద కూర్చుంటూ.

"ఏమీ అనుకోకపోతే ఓ మాటడుగుతాను. ఎప్పుడూ అలా ''మూడీ'' గా వుంటారెందుకమ్మా? ధ్యానం చేసుకుంటుంటారా?" అంది కుతూహలంగా డాక్టర్.

"ఊహూఁ!" అని అంతలోనే సరుకుని చిరునవ్వు నవ్వింది భైరవి.

''ధ్యానంతప్ప మరోధ్యాస మాకుండదు. ఈ అనిత్యమైన దేహాన్ని ఇంకా ఎంతకాలం ధరించటం? ఇది వున్నంతవరకూ ఈ అనారోగ్యాలూ, మందులూ, ఆకలి దప్పులూ తప్పవు. ఎప్పటికప్పుడు యోగ మార్గంలో... బ్రహ్మరంధ్రం గుండా ఈ ప్రాణాన్ని వదిలివేద్దామనిపిస్తుంటుంది. కానీ దాని టైము పూర్తయేవరకూ ప్రాణాన్ని వదిలివేసే హక్కు ఈ దేహానికి లేదే! అధవా, వదిలినా ఆ శేషం కోసం మరో జన్మ తప్పదు!'' అంది భైరవి, బెడ్‌మీద ఆసింపట్టు వేసుక్కూర్చుని.

డాక్టర్ పద్మావతికి, ఈ రకమైన భైరవి వాగ్ధోరణి చాలా కుతూహలంగా వుంటుంది. విన్నకొద్దీ వినాలనిపిస్తుంటుంది. వేలాది భక్తులూ, వందలాది శిష్యులూ, శిష్యురాళ్లూచేత ఆ జిల్లా అంతా పూజ లందుకొనే భైరవి, తన దగ్గర చికిత్స పొందుతోంది! సంవత్సరానికో మారు ఆమె అనుజ్ఞ ఇచ్చిన వ్యక్తికి మాత్రమే ఆమె "పాదపూజ" చేసే అర్హత లభిస్తుంది. అలాంటిదీరోజు! ఆమె చేతులూ, వెన్నూ, ఎదా, తలా, నుదురూ, పాదాలూ, అన్నీ తను స్పృశించగలుగుతోంది. ఆమెతో ఓ అరగంట ఇంటర్‌వ్యూ దొరకాలంటే, ఆమె ఆశ్రమ కార్యనిర్వాహకవర్గాన్ని కాకాపట్టీ... 'ఎలాగో ఓలా' మంచి చేసుకునీ, స్పెషల్ రెకమండేషన్ ద్వారా, సాధించవలసిందే! అలాంటిదీరోజు, ఆమెతో ఎంతో సన్నిహితంగా కూర్చుని, గంటల తరబడి మాట్లాడే అవకాశం కలిగింది. ఆమె పాదధూళి తమ ఇళ్లలో ప్రసరించటం కోసం, ఎందరో లక్షాధికార్లూ, కోటీశ్వరులూ అయిన భక్తులు, ఆమెను కార్లలో తమ గ్రామాలకూ, టౌన్‌లకూ పిల్చుకెళ్తారు... ఈరోజు చికిత్సకోసం... మారుమూల ప్రాంతంలోవున్న తన నర్సింగ్‌హోంకు... తన స్వంత ఇంటికి ఆమె తరలి వచ్చింది! పద్మావతికిదెంతో గర్వంగా వుంది. తృప్తిగా వుంది.

"ఒద్దు... ఒద్దు... మీరు దేహపరిత్యాగం చెయ్యవద్దు. మీరింకా దేశం నలుమూలలా పర్యటించి, జనబాహుళ్యానికి మీ అమూల్యమైన సందేశాలు అందివ్వాలి." అంది పద్మావతి కంగారుగా.

"అదే ఆలోచిస్తున్నాను," అంది భైరవి గొప్పగా.

"వస్తానమ్మా! పేషెంట్సును చూచి... మళ్ళీ మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు మీ దర్శనం చేసుకుంటాను. ఈ లోగా మా చెల్లాయి పద్మజ మీక్కావలసినవి చూస్తుంటుంది." అంటూ వినయంగా వెళ్ళిపోయింది డాక్టర్ పద్మావతి.

పద్మజ పేరు వినబడగానే, భైరవి కెందుకో క్షణకాలం భయం వేసింది. పద్మజ కూడా ఎం. బి. బి. ఎస్. మూడో సంవత్సరం చదువుతోంది. చాలా చలాకీగా వుంటుంది. పద్మావతి దెంత గంభీర స్వభావమో, పద్మజదంత "లైట్" మనస్తత్వం. భైరవిపట్ల పద్మావతి ఎంతటి గౌరవమూ, భక్తీ ప్రదర్శిస్తుందో పద్మజ అంతటి హేళనా, దురుసుతనం ప్రదర్శిస్తుంది. భైరవి వున్న స్పెషల్ రూం మేడమీద పద్మావతి ఇంట్లోనే ఓ భాగం. మేడక్రింది భాగమంతా మామూలు రూంలూ, స్పెషల్ రూంలూ వున్నాయి రోగుల కోసం. ఎవరేనా సినీతారలూ, కోటీశ్వరుల కుటుంబాలలో, లక్షాధికారుల ఇళ్లలో రహస్యంగా చికిత్స పొందదల్చుకున్నవారికి మాత్రమే ఆ రూం కేటాయించబడింది. పద్మజకు అతి కుతూహలం భైరవినిస్టడీ చెయ్యాలని. అందుకే, ఆమె అక్కను ఒప్పించి, అదృష్టవశాత్తూ వచ్చిన కాలేజీ శలవులను, భైరవి సేవకు వినియోగిస్తోంది. వీలు చిక్కినపుడల్లా భైరవితో చర్చకు దిగుతుంది. మొదట్లో భైరవికి ఆ అమ్మాయితో చర్చ, సరదాగానూ, గొప్పగానూ వుండేది. రాను రాను, పద్మజ, కాలికీ, మెడకూ వేసి, తనలోని బలహీనతల్ని బయటకు లాగుతోందని అర్థమయ్యాక, పద్మజ సహేతుకంగా విమర్శిస్తుంటే, జవాబులు చెప్పలేకా, చెప్పినవి సమర్థించుకోలేకా, సతమతమైపోతోంది భైరవి. తన ఆశ్రమంలో అయితే, ఇలాటి చిక్కులను "ప్రథమ శిష్యుడు", "ప్రథమ బిడ్డ" అయిన భైరవి భర్త ప్రసాదరావు తెలివిగా తప్పించేవాడు. ఆయన ఆశ్రమంలో లేని టైములో ప్రధాన శిష్యులా బాధ్యత వహిస్తారు. అంతకూ గడ్డు పరిస్థితి అయితే భైరవి "మౌనవ్రతం" ప్రకటించేస్తుంది.

"భైరవీ జీ! మీకు పోస్ట్!" అంటూ వచ్చింది పద్మజ నవ్వుతూ.

"ఇలా ఇవ్వు! నా అడ్రస్, ఎవరికో, ఎలా తెలిసిందో?'' అంది కవరు తీసుకుంటూ భైరవి.

"దాందేముందిలెండి? సర్వాంతర్యామి అడ్రస్ ఒకరు చెప్పాలా? గాలీ, నీరూ, చెప్పి వుంటాయి..." అంది పద్మజ నవ్వుతూ గార్డెనింగ్ ఛేర్‌లో కూర్చుంటూ.

''కొంపదీసి నువ్వుగానీ మీ కాలేజీలో చెప్పావా? ఇక "దర్శనాల" కోసం జనం ఎగబడుతారు?" అంది భైరవి గొప్పగా.

జాగ్రత్తగా ఆమెను గమనిస్తున్న పద్మజ పకపకా నవ్వింది.'' నేనా? ఛస్తే చెప్పను! ఆ దర్శనాల "షో'' అంటే నాకు పరమ అసహ్యం. అసలు మనిషిని దేవుడని భ్రమించి, పిచ్చిగా మొక్కే పద్ధతి, మన దేశంలో వున్నంత ఎక్కువగా,మరే దేశంలోనూ లేదు, భైరవీ జీ! ఇదే మనవాళ్లలోని అజ్ఞానానికి పరాకాష్ఠ. మనిషి – మహా అయితే బాధగురువో, బోధగురువో కాగలడుగానీ – దేవుడు కాగలటండీ? ఎవరేనా ఆరాతీసి, మీ గురించి అడిగినా ఖచ్చితంగా చెబుతాను..." భైరవిగారు జబ్బుతో వున్న మామూలు మనిషి... మీరనుకొనే దేవత కాదు... అని. సరేనా! మీరు నిశ్చింతగా విశ్రాంతి, మందులు తీసుకోండి..."

భైరవికి నాలుక తడారిపోతోంది. ఉదయాన్నే ఈ అమ్మాయి తన అస్త్రాలతో, తయారయ్యిందేమిటి? ఈ రోజు కూడా కాలేజీకి శలవు కాబోలు ఖర్మ!

"ఓ రెండు గంటల్లో మీకు భోజనం పట్టుక వస్తాను భైరవీ జీ! ఈలోగా ఓ కప్పు హార్లిక్స్ తెమ్మంటారా? పళ్లరసమా? ఏదీ ఒద్దనకండి. నేనేమో సరిగా మిమ్మల్ని "ట్రీట్'' చెయ్యలేదని అక్క నన్ను చంపేస్తుంది."

"ఏదో ఒకటి ఇవ్వు!'' అంది భైరవి తడబాటుగా.

"ఆల్‌రైట్!" నవ్వుతూ వెళ్లిపోయింది పద్మజ.

"హమ్మయ్య!" తేలిగ్గా ఊపిరి పీల్చుకొని, ఆ అమ్మాయి వెళ్ళినవైపే, క్షణకాలం చూచి, కవరు చేతికి తీసుకొని, బెడ్‌మీద పడుకొని ఉత్తరం చదవటం మొదలెట్టింది భైరవి.

"డియర్ భార్గవీ!

...మారుమూల ఓ టౌన్‌లో గల నర్సింగ్‌హోంలో నీవు రహస్యంగా చికిత్స పొందుతున్నట్లు, నీ ఉనికి తెలిస్తే నీ భక్తులు నీ దర్శనానికివచ్చి, విశ్రాంతి దొరకనివ్వరనీ, నీ అడ్రస్ ఎవరికీ తెలుపవద్దనీ – నీ భర్తగారు ఈ మధ్య ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పారు. నీ అడ్రస్ నేనెవరికీ చెప్పనులే. భయపడకు. నా ఇద్దరు పిల్లలూ బాగా ఊహతెలిసేంతగా పెరిగారు. నా తనువు వున్నంత వరకూ వాళ్ల బాగోగులూ, క్రమశిక్షణా చూస్తాను. ఇదే నా యోగం. ఇదే నాకు ముక్తి. స్వధర్మాచరణను మించిన తపస్సు వేరే లేదని నా దృఢ విశ్వాసం. నేనున్నా, పోయినా, నా బిడ్డలు క్రమశిక్షణతో మెలిగి, వాళ్ల జీవితాల్ని, సక్రమ మార్గంలో నడుపుకో గలరన్న నమ్మకం నాకుంది.

ఈ సొదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే, నాకీమధ్య తరచూ గుండెనొప్పి వస్తోంది. ప్రస్తుతం ఇక్కడి గవర్నమెంటు హాస్పిటల్లో వున్నాను. ప్రాణం

పోసినా, తీసినా, ఇక్కడి డాక్టర్లు రెంటికీ సమర్థులు!

భైరవీ! కాదు కాదు... భార్గవీ! నీ ఆరోగ్యమూ చాలా చెడిపోయిందని తెలిసింది. చివరగా (ఇది నీ అంతమో, నా అంతమో, లేక ఇద్దరమూ ఇలాగే బ్రతికి వుంటామో - ఎవరికి తెలుసు?) మరోమారు నిన్ను హెచ్చరిద్దామని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నీవు భైరవిగా- దేవతగా పూజలందుకుంటున్నావు. నీవు ఈ ప్రదర్శించిన "షో" లో - నీ ప్రియ శిష్యులూ, శిష్యురాళ్ళూ చేసిపెట్టిన కాన్వాసింగ్‌లో - నీ పేరుతో నడిచే నీ ఆశ్రమంలో, ఎంత శాతం ఆత్మవంచన, పరవంచన దాగి వున్నాయో, ఇప్పుడైనా ఒక్కసారి లెక్కవేసుకో! పరవంచన కంటే అసహ్యకరమైనది ఆత్మవంచన.

భైరవీ! ప్రతి మనిషికీ - జీవితంతో "యోగకాలం" అన్నది ఓ పది పదిహేనేళ్లు వుంటుంది. ఆ టైములో ఆ వ్యక్తి పట్టింది బంగారమౌతుంది. పలుకుబడి, పేరూ, శాంతీ అన్నీ వుంటాయి. అప్పుడే ఆ వ్యక్తిలో "అహం" పెరుగుతుంది. వివేకవంతులైతే, "వ్యక్తిత్వాన్ని మంచిగా మలుచుకొంటారు. ఆ తర్వాత ఇక గింజుకున్నా ఆ యోగకాలంరాదు.

ఇంచుమించూ నీకూ అంతే! నీవు గడిపిన భోగం... యోగం... నీవు రమ్మన్నా ఇక రావు. ఆ ఛాప్టర్ అయిపోయింది. నీ ఆరోగ్యం దెబ్బతిన్నది. ఒక విధంగా ఇది నీకు వరం.

ఇన్నాళ్లూ, ఇన్నేళ్లూ... నీవు నీ చుట్టూరా సృష్టించుకున్న వాతావరణంలో... నీలోని నిన్ను గురించి ఆలోచించుకొనే అవకాశం లేకపోయింది. ఇప్పుడయినా, ఒకసారి "నీలోకి నువ్వు చూచుకో "

చచ్చిపోయినా, బ్రతికివున్నా, ఈ నీ స్నేహితురాలు మాత్రం.... నిన్ను భార్గవిగా తప్ప, భైరవిగా గౌరవించదని తెలుసుకో.

నీ—

"లలిత"

ఉత్తరం పూర్తిచేసిన భైరవి గుండెలు కోపంతోనూ, మరోవిధమైన భావోద్వేగంతోనూ క్షణకాలం అదిరిపోయాయి. లలిత... తనను ఏనాడూ నమ్మలేదు... నమ్మదు...

"నేను భైరవి కానా? దేవతనుకానా? ముల్లోకాలకు తల్లినీ... లక్ష్మినీ, సరస్వతినీ! రాజేశ్వరినీ! సర్వదేవతా స్వరూపాన్నికానా?" భైరవి కెందుకో - ఎవరో వెన్నుమీద ఛెళ్లున చరిచినట్లైంది... ఉలికిపడి గదంతా చూచింది. ఎవరూ లేరు...

"నీవు నిజంగా భైరవివా? దేవతవా? అందరి కోర్కెలూ, కష్టాలూ తీర్చగల జగదంబవా? అదే నిజమైతే... నీ బిడ్డలు... నీ సమస్యలు... నీ భయాలు,.. అవి ఎందుకున్నాయి?

ఎవరో లోపల్నుంచి ప్రశ్నిస్తున్నారు. ఎవరూ?

భైరవి బెడ్‌మీద వెల్లికిలా పడుకుంది. పైన సీలింగ్‌ఫాన్ గిర్రున తిరుగుతోంది. ఆమె తలలో గతమంతా దృశ్యాలుగా తిరుగుతోంది...

* * *

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన భార్గవి స్కూల్‌ఫైనల్ వరకూ చదువుకుంది. క్లాసుమేటు లలిత చాలా ఆత్మీయురాలు. కారణం ఇద్దరి కుటుంబ ఆర్థిక వనరులూ, బాధలూ ఇంచుమించు ఒకటే కావటం. క్లాసుమేట్సులో కొందరమ్మాయిలు రోజుకొక కొత్తరకం ఖరీదైన ఓణీ, జాకెట్టు, పరికిణీ, నగలు... ఇలా మార్చి మార్చి ధరించినప్పుడూ, కొందరమాయిల్ని కారులో స్కూల్లో దిగబెట్టినప్పుడూ, ఆ అమ్మాయిలపట్ల ఎక్కువమంది టీచర్స్ "అతి మర్యాదగా" ప్రవర్తించినప్పుడూ, భార్గవిలో ఒకవిధమైన అలజడి, అసూయ కెరటంలా లేచేవి. తనకూ అలాటి ప్రత్యేకత వుంటే బావుండును, అనుకొనేది. ఆ మాటే లలితతో అనేది.

లలిత నవ్వి "పోనిద్దూ! ఎవరిలానో మనంలేమని ఏడ్చేకంటే, మనలోనే మనం వుండిపోదాం!" అనేది. ఈజవాబు భార్గవికి నచ్చలేదు.

తనదంటూ ఏదో ఓ ప్రత్యేకత ఏర్పడాలనే తపన ఆ అమ్మాయిలో వయసుతోబాటు పెరగసాగింది.

"లలితా! ఇల్లోనుంచి పారిపోయి, సినిమాలలో చేరుదామా? బోలెడంత కీర్తి, డబ్బు వస్తాయి!" అందో రోజు.

లలిత అదిరిపడింది. భార్గవిలో ఆ కాంక్ష ఎంతటి తీవ్రరూపం ధరించిందో అర్థమయింది. ''వద్దు భార్గవీ! ఛాన్సులు రాకపోతే, మన పాట్లు కుక్కలు కూడా పడవు. ఇటు మన కుటుంబాలలో మనం ఏర్పరచే మచ్చవల్ల... ఏ తప్పూచేయని మన చెల్లాయిలూ, తమ్ముళ్లూ, తల్లిదండ్రులూ, శిక్ష అనుభవించాలి! పిచ్చి ఆలోచనలు వద్దు!" అంది. భార్గవికి లలితమీద చెప్పలేనంత కోపం వచ్చింది. 'అతి వాస్తవంగా ఆలోచిస్తుందేమో లలిత' అనిపించింది కూడా.

భార్గవి ఆలోచనలు అలా సాగుతూండగానే, భార్గవికి పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళైపోయింది. భార్గవి భర్త ప్రసాదరావు, స్కూల్ ఫైనల్ పాసయి, స్వంత గ్రామంలో వ్యవసాయం చూచుకొంటున్నాడు. ఎక్కువగా ఆస్తిపాస్తులు లేవుగానీ, పరువుప్రతిష్ఠగల మంచి కుటుంబం అది.

కాపురానికి వచ్చిన భార్గవిలో అసంతృప్తి పడగలు విప్పుకొంది. అత్తమామలూ, ఆడబడుచులూ, బావగార్లు, మరదులూ, తోడికోడళ్లూ... వచ్చేపోయే అతిధులూ... పశువులూ, పాడి,

అస్తమానూ చాకిరీ... "పుష్టికరమైన, స్వచ్ఛమైన ఆహారమూ, గాలీ, వెల్తురూ, పెద్దలోగిలీ... ప్రశాంతమైన జీవన సరళి" అని ఏనాడూ మనసుకు నచ్చ చెప్పుకోలేకపోయింది. భర్త ప్రేమగానే చూచుకొన్నా, పదిమందిలో పదకొండవ వ్యక్తిగా తప్ప... ఏ ప్రత్యేకతా లేని బ్రతుకిదేమిటి? అని పదేపదే బాధపడటం మొదలెట్టింది. ఇలా ఏదో అసంతృప్తితో రోజూ పోరుతున్న భార్యంటే... పదేళ్లు తిరిగేసరికి... ఇద్దరు పిల్లలు కలిగే సరికి... ప్రసాదరావుకు ఓ విధమైన భయం పట్టుకుంది... అసహ్యమూ, విముఖతా ఏర్పడ్డాయి... అస్తమానూ కీచులాటలతో ఇద్దరిమధ్యా దాంపత్య సుఖంకూడా బొత్తిగా లేకుండాపోయింది. ఒక్కోసారి పుట్టినే అలిగి అన్నం తినక పోవటమూ, ఇంటిల్లిపాదితో పోట్లాడ టమూ, పూనకం వచ్చిన దానిలా అరుస్తూ రభస చేయటమూ భార్గవిలో ఏదేనా జబ్బు.. గాలి... లక్షణాలా? అని ఇంట్లోని పెద్దవాళ్ళంతా ఆలోచనలో పడుతున్నారు. భార్యని అదుపులో పెట్టుకోలేని భర్తగా, తనని తండ్రి, అన్నదమ్ములూ, బంధువులూ... అందరూ ఈసడిస్తారేమోననీ, కుటుంబ పరువు బజారుకెక్కుతుందేమోననీ, ప్రసాదరావుకు తగని భయం పట్టుకుంది. పరిష్కారం ఏమిటో బుర్ర బద్దలు కొట్టుకున్నా బోధపడటం లేదతగాడికి.

ఓ రోజు భార్గవి రెచ్చిపోయింది. "నాకీ ఇంట్లో ఏ ప్రత్యేకతా లేదు! నా ఉనికి ఎవరికీ అక్కరలేదు.. ఇక ఒక్కక్షణం... ఈ ఇంట్లో 'మనిషిగా' వుండలేను." అంటూ పూనకం వచ్చిన దానిలా అరవసాగింది. అంతక్రితం రోజంతా అలిగి అన్నం తినకపోవటంతో, నిద్ర సరిగాలేక ఆమె కళ్లు ఎర్రగా వున్నాయి... ఇంటినిండా బంధువులు... వసారానిండా ఇతర గ్రామాలనుంచి ఏవోపనులమీద వచ్చిన పెద్దమనుషులూ, మోతుబరులూ... ఇంతమందిలో... ఈ సంఘటన జరగటంతో ప్రసాదరావు పై ప్రాణాలు పైనే పోయాయి... మెరుపులా ఏదో ఆలోచన అతగాడి తలలో తళుక్కున మెరిసింది.

"తల్లీ! క్షమించు! నిన్ను మానవ మాత్రురాలిగా భావించి... తప్పు చేస్తున్నాం... చాలాసార్లు నీవు నాతో హెచ్చరిక చేసినా, నా అజ్ఞానంకొద్దీ... నేను, నీ నిజస్వరూపాన్ని అందరికీ వెల్లడించలేకపోయాను... ఇక నీ ఆజ్ఞ ఉల్లంఘించను. ఈనాటినుంచీ నీవు తల్లివి... నేను నీ బిడ్డను!" అంటూ... భార్య పాదాంమీద సాష్టాంగ పడ్డాడు! భార్గవి హడలిపోయిందీ విపరీతానికి. భర్త భార్గవి చెయ్యిపట్టి—అందరి ఎదుటా కుర్చీలో కూర్చోపెట్టాడు. "అమ్మా! త్వరగా టెంకాయ తీసుకురండి. పెద్ద వదినా, హారతి వెలిగించండి. చిన్న వదినా, సాంబ్రాణిధూపం వేయండి." అంటూ హడావుడి మొదలెట్టాడు... ఏం జరుగుతుందో... ఎందుకు జరుగుతోందో తెలుసుకోలేకా, నమ్మలేకా, మానలేక, అందరూ పరుగులు తీశారు.

"భార్గవి... చాలా ఏళ్లుగా భైరవారాధన చేస్తోంది... భైరవి రూపంలోనే దేవి దర్శనం ఇచ్చింది సంవత్సరం క్రితం... ఆ తల్లి ఇక సాత్వికారాధన చేయమనీ... లక్ష్మి, సరస్వతి, రాజేశ్వరి... వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి... సుబ్రహ్మణ్యేశ్వర స్వామి— ఇలా సర్వదేవతా స్వరూపంగా... భార్గవిలో నిలచిపోతాననీ చెప్పిందట. సంవత్సరంనుంచీ భార్గవికీ, నాకూ భార్యాభర్తల సంబంధం లేదు అందువల్లే! ప్రతిరోజూ ఈ రహస్యం అందరితో చెప్పమనీ... తనని దేవతగా ఆరాధించమనీ చెబుతోంది... కానీ నా అజ్ఞానంకొద్దీ...చెబితే మీరంతా నాకు 'పిచ్చి' అంటారని చెప్పలేదు... భార్గవికాదు ఆమె పేరిప్పుడు. భైరవి! దేవత!" అంటూ చెప్పాడు ప్రసాదరావు అందరితో. చెప్పి, మళ్ళీ "తల్లీ! క్షమించు!" అంటూ భార్గవి కాళ్లమీద పడ్డాడు... అందరూ ధూపనైవేద్యాలు సమర్పించారు. "భైరవీ! మాతా! జగజ్జననీ! శరణు!" అంటూ నమస్కారాలు చేశారు...పల్లెటూళ్ళో ఈ వార్త క్షణాల మీద పాకిపోయింది... జనం విరగబడి వచ్చారు. అందాకా ఏ ప్రత్యేకతా లేదని బాధపడుతున్న భార్గవికి ... ఒక్కసారి లభించిన ఈ ప్రత్యేకతతో ముచ్చెమటలు పోశాయి. శోషవస్తున్నట్లయ్యింది. కుర్చీకి అంటుకుపోయి వెర్రిచూపు చూస్తూ కుర్చుంది. (అది అర్ధనిమీలితాలైన... అమ్మవారి చూపుగా అభివర్ణించాడు ప్రసాదరావు) క్షణాలలో - భార్గవితోపాటు ఆ కుటుంబానికే ఓ ప్రత్యేకత వచ్చేసింది.

"భార్గవీ! మంచో, చెడో, తెలిసో, తెలియకో, పరిస్థితి ఇలా మలుపు తిరిగింది. తెలివిగా మసులుకొన్నామంటే, వెర్రి జనాన్ని ఆకట్టుకోవటం ఏమంత కష్టమైన పనిగాదు!" అన్నాడు ప్రసాదరావు, కాస్త వీలుచూచుకొని, రహస్యంగా. కుటుంబంలో తనకూ, తన భార్యకూ ఒక్కసారిగా ఓ ప్రత్యేకత లభించటంతో, అతగాడిలోనూ అది నిలుపుకోవాలన్న కోరిక విజృంభించింది.

"మరి మగపిల్లలిద్దరి గతీ?" అంది భార్గవి. ఇందాకా... జరుగుతున్న గొడవేమిటో సరిగా బోధపడక... తల్లిదగ్గరకు చనువుగా రాలేక బిక్కుబిక్కుమని చూస్తున్న పిల్లలను తల్చుకోగానే... గుండె చెరువైంది భార్గవికి.

"నే లేనూ? నువ్వు మాత్రం లేక ఎక్కడికి పోతున్నావు? అసలు దేవత బిడ్డలుగా వాళ్లకెంత అగ్రస్థానం లభి

స్తుందో చూస్తుండు?" అన్నాడు భర్త. ఆదీ నిజమే అయ్యింది. నెల తిరిగేసరికి, చుట్టుప్రక్కల పల్లెలకూ, ఓ మోస్తరు బస్తీలకూ పాకిపోయింది భైరవి మహాత్యం. జనం బండ్లు కట్టుక వస్తున్నారు. కొందరికి జబ్బులు నయమయ్యాయిట! మరికొందరికి 'కొత్త అదృష్టాలు' పట్టాయట! కొందరికి గ్రహాలు తొలగిపోయాయట! కొందరికి తాయెత్తులు, మరికొందరికి విభూతి, ఇంకా కొందరికి కుంకుమ... ఇలా వారి సమస్యలు... వారి వారి వారి ఆందోళనలు బట్టి... భైరవి ఇస్తోంది! రాను రాను...కానుకల వర్షం కూడా ప్రారంభమైంది. మొదట్లో పూలు, పండ్లుగా వున్న కానుకలు, పోను పోను పట్టుచీరెలు, బంగారు నగలు... వెండి పాదరక్షలు... బంగారు కిరీటాలూ, రాళ్ల నగలు... బ్రహ్మాండమైన "రోజ్ వుడ్ ఉన్నతాసనం", (పూర్వకాలపు రాజులు కూర్చునే సింహాసనం లాటిది) వరకూ పెరిగాయి. కానుకలు వద్దంది మొదట్లో భైరవి... కానీ తామరతంపరగా పెరిగిన శిష్యులూ, శిష్యురాళ్ళూ మొహమాటపెట్టడమూ, "షార్ట్ కట్"లో పాపాలు పోగొట్టుకొని (కొత్త పాపాలకు పునాదులు వేసుకుని) ముక్తి మార్గాన్ని చేత బట్టుకోవాలనుకొనే లక్షాధికార్లూ, కోటీశ్వరులూ అయిన కొందరు భక్తులు పట్టు పట్టడంతో...

"సరే! ముల్లోకాలకూ తల్లిని నేను... ముల్లోకాలూ నా ఇల్లే! మీ రంతా నా బిడ్డలు...మీకు కానుకలు ఇచ్చే అర్హతా, పుచ్చుకునే చనువూ నాకూ వున్నాయి!" అని అంగీకరించింది భైరవి.

ఆమె పిల్లలిద్దరికీ... మొదట్లో తల్లి దగ్గరకు వెళ్లేందుకు లేదన్న బెంగ కలిగినా, ఆపిల్సూ, అరటిపళ్లూ, స్వీట్సూ, కొత్త కొత్త డ్రెస్సులూ అమరటంతో ఆ బెంగపోయింది. ఇంట్లో, బయటా అందరూ తమని దేవతాబిడ్డలుగా ముద్దు చేయటంతో, స్కూలుకు వెళ్ళినా, మానినా, స్కూల్లో అల్లరిచేసినా, ఏమీ అనకపోవటంతో, హాయిగావుంది.

భైరవిగా భార్గవి మారాక... ప్రసాదరావు ఆమెను... కొందరు బాబాలూ, అమ్మవార్లూ, స్వామీజీలు (వారిలో కొందరు కపటయోగులని ఆయనకూ తెలుసు!) దగ్గరికి తీసికెళ్లాడు. తత్వబోధకోసం కాదు... వారెలా కూర్చునేది, ఎలా కనుబొమలు ఎగురవేసేది... అభయముద్ర పట్టేది.. వేదాంత విషయాలు చెప్పేది... ఇలాటి చిట్కాలు చూచి... అనుకరించటానికని? భార్గవి... ఊహూ భైరవి, ఏకసంధాగ్రాహిలా అవన్నీ నేర్చుకొంది. ఓసారి... ఓ యోగి దగ్గరకు ఇలానే వెళ్ళి... తీరా అతగాడు దిగంబరుడు అని తెలిసి... చూచి... "కొంపదీసి తననీ ఇలా దిగంబరంగా తిరగమంటాడేమో!" నని భయంవేసి వెనక్కి వచ్చేసింది...

భైరవికిప్పుడేమీ పనిలేదు. ప్రత్యేకతకు కొదవలేదు. చీకటితో లేచి స్నానం చేసి, కాస్సేపు పూజామందిరంలో కూర్చొని...తర్వాత భక్తులెవరో కానుకగా సమర్పించిన ఖరీదైన పట్టుచీరె కట్టుకుని... భక్తులు భక్తితో కానుకగా ఇచ్చిన రాళ్ల, బంగారు నగలు శరీరం మోయగల వరకూ అలంకరించుకొని... భక్తులు కొందరు భారీఎత్తున చందాలు వేసి బ్రహ్మాండంగా కట్టించిన ఆశ్రమం (భవనం)లో పెద్ద హాల్లో... రోజ్ వుడ్ సింహాసనంమీద భాసింపట్టు వేసుక కూర్చుంటుంది. ఇక శిష్యులూ, శిష్యురాళ్ళూ భైరవి మహత్మ్యాలు గానం చేస్తారు. ఆ తర్వాత భక్తులు... వారి వారి హోదాల ననుసరించి, దర్శనాలకు వచ్చి, పాదాభివందనాలు చేయటం... తమ సమస్యలు, సందేహాలు చెప్పుకోవటం... కానుకలు సమర్పించటం జరుగుతుంది- భైరవి వారందరికీ సందేహ నివృత్తిచేసి వేదాంతం బోధిస్తుంది... ఎవరేనా అతిగా ప్రశ్నలువేస్తే "ఇన్ని ప్రశ్నలెందుకు నాయనా! నీలోకి నువ్వు చూచుకో?" అంటుంది ఆఖరుగా...

నాలుగేళ్ళు తిరిగేసరికి... ప్రసాదరావు ఆ ప్రాంతంలో పలుకుబడిగల... బంగారు భూములుగల పెద్ద రైతుగా మారాడు... పాత ఇల్లు మార్చి పెద్ద బంగళా కట్టించాడు. వడ్డీలకు మారుతున్న డబ్బు...

ఓ రోజు ఓ యువకుడు వచ్చాడు. భైరవి శరీరం మీద మెరుస్తున్న ఆభరణాలను, పట్టుచీరెనూ మార్చి, మార్చి చూశాడు.

"దేవుణ్ణి మీరు చూశారా?" అన్నాడు.

భైరవి చిరునవ్వు నవ్వింది... అలా నవ్వటం ఆమె అలవాటు చేసుకొంది. "నేనే దేవుడు... దేవుడే నేను! ఇక "చూసేదేమిటి?చేసేదేమిటి?" అందిగంభీరంగా! "ఆహా! కొండంత అర్థంగల వేదాంతసారం!'' అన్నాడొక భక్తుడు మూర్ఛపోతూ!

ఆ యువకుడు నవ్వాడు "అలా కప్పదాటు వేయకండి. ఈ ప్రశ్న అడిగిన నరేంద్రుడికి... దైవదర్శనం కలిగించి-వివేకానందుడిగా మార్చాడు రామకృష్ణ పరమహంస...మీరూ అలాగే - మీలోకి వచ్చేదేముణ్ణి... మీ పేరులానే భైరవాకారంతో నయినా సరే నాకు చూపాలి!" అన్నాడు పట్టుదలగా! భైరవి జంకింది. ఇతగాడెవరో... తెగించిన రకంలా వున్నాడు.

"నీకు దైవాన్ని చూచే అర్హత రావాలి నాయనా?" అంది మెల్లిగా.

"ఏ అర్హత? మీలా బంగారు తొడుగు తొడుక్కొనే అర్హతా! పట్టు పీతాంబరాలు ధరించే అర్హతా? గుడ్డేటుగా మీరు చెప్పే మాటలు కొన్ని నిజమైతే-గుడ్డిగా నమ్మే ప్రజల మూర్ఖత్వాన్ని "కాష్" చేసుకొనే అర్హతా? రాయినీ, రత్నాన్నీ సమదృష్టితో చూడలేని మీలోకి దేవుడు రాగా... ఎవరు నిజమైన యోగులో... ఎవరు బూటకపు వేషధారులో గుర్తించగలిగిన... నాకు దేవుణ్ణి చూచే అర్హత

లేదంటారా? చూపించగల "సత్తా" మీకు లేదని ఇప్పుడైనా గుర్తించండి... ఒప్పుకోండి!" అన్నాడు ఆవేశంగా...

ప్రధాన శిష్యులు... ప్రధాన బిడ్డ (భర్త) భక్తులూ అదిరిపోయారు... ఆ యువకుణ్ణి "పిచ్చివాడు" అని బయటకు గెంటారు భార్గవికి... చెమటలు పట్టాయి... అది గమనించి ఆ రోజుకిక "దర్శనం" ఆపివేశారు... ఆశ్రమ నిర్వాహకవర్గం సమావేశమైంది అత్యవసరంగా... ఈ మధ్య భైరవి చెప్పిన ప్రశ్నలు కొన్ని తప్పిపోయాయి... కొందరికి రోగాలు నయం కావటంలేదు. తల్లికి వస్తున్న కానుకల విషయమై కొంచెం గుసగుసలు వ్యాపిస్తున్నాయి... కాబట్టి కొన్నాళ్ళపాటు భైరవి "మౌనవ్రతం" పూనటం మంచిది. (రాత్రివేళ ప్రధాన శిష్యులతో, శిష్యురాళ్లతో, కార్యనిర్వాహక వర్గంతో ఫ్రీగా మాట్లాడవచ్చు!) అని తీర్మానించారు.

లలితకు పెళ్లై అత్తారింటికి వెళ్ళింది. ఆమె భర్త ఓ హైస్కూలు టీచరు. అతగాడికి పెళ్ళికావలసిన ఇద్దరు చెల్లాయిలూ, వృద్ధులైన లలిత తల్లిదండ్రులూ వుండటంతో ఆర్థికంగా చాలా బాధలు పడింది లలిత. కానీ ధైర్యం కోల్పోలేదు. టీచర్స్ ట్రెయినింగ్ పాసయి... తనూ టీచరుగా చేరింది. ఇద్దరు పిల్లలు. తన సంసారం... తన బిడ్డలు... తన భర్త... ఇవే ఆమె ఆలోచనలు...మరే ప్రత్యేకతా లేని జీవితం...కోరని జీవితం ఆమెది. భార్గవి జీవితంలో వచ్చిన మార్పులు ఎప్పటి కప్పుడు తెలుసుకొంటోంది లలిత.

"భార్గవీ! నీ వ్యక్తిత్వాన్ని నీవు చంపుకొని...నీ శిష్యుల, భక్తుల చేతిలో కీలుబొమ్మవై పోయిన నీవు సాధించిన ప్రత్యేకతేమిటి? డబ్బా? నగలా? భోగమా? కపట కీర్తా?

నీవు చేస్తున్న ఈ మోసం ఎక్కువ కాలం సాగదు సుమా? కాల ప్రవాహం వేసే బరువుకు నీవు నిలవలేవు. ఈ మధ్య చాలామంది స్త్రీలలో - పూనకమూ... తమలోకి ఓ దేవత (లక్ష్మి... వెంకటేశ్వరస్వామి... ఇలా) వస్తోందన్న వూహ... దానితో వాళ్లుచేసే హంగామా... (చుట్టూరా వాళ్లుచేసే రభస) పెరిగిపోతోంది... ఇదొక రకమైన హిస్టీరియాలాటి జబ్బు కావొచ్చు. నీవూ అలాటివారిలో ఒకతెవు... మీరంతా కాలప్రవాహంలో తేలుతున్న నీటి బుడగలు... నీటి బుడగలమీద క్షణకాలం ప్రసరించిన సూర్యకిరణం వల్ల... కొద్దిసేపు వెదజల్లబడే ఏడు రంగులు... అశాశ్వతమైనవి .. ఆ నీటిబుడగ పేలిపోగానే... ఆ రంగులూ మాయమైపోతాయి.

నీవు దేవతవంటే చస్తే నమ్మను .. కోటిమంది యోగులలో ఒక్కడే "పరమహంస" (రామకృష్ణ పరమహంస) కాగలిగాడు! లక్షలాది విరాగులలో ఒకరే మహర్షి (రమణ మహర్షి) కాగలిగారు! కోట్లాది మానవులలో ఒక్కరే మహాత్ముడు (గాంధీజీ) కాగలిగారు: లక్షల... కోట్ల స్త్రీలలో ఒక్కరే నిరాడంబరమైన మాతృశ్రీ (శారదాదేవి) కాగలిగారు.

ఇకనైనా...ఈ నాటకానికి తెరదింపు... క్రమశిక్షణ లేకుండా పెరుగుతున్న నీ బిడ్డలను... ఓ తల్లిగా... బాధ్యతగల గృహిణిగా దిద్దుకో... తర్వాత విచారిస్తావు!" అంటూ వ్రాసింది ఉత్తరం.

ఆ ఉత్తరం చదివి భైరవికి చాలా కోపం వచ్చింది... బ్రతకటం చేతరాని చవటలంతా ఇలాగే మాట్లాడుతారు... తన బిడ్డలకేం లోటు? మూడు తరాలకు తరగని ఆస్తి తయారుచేసింది తను! లేని పోని భయాలతో లభించిన ప్రత్యేకతను వదులుకోలేదు.

పదేళ్ళు తిరిగేసరిగి... కాలంలో... దేశంలో కూడా మార్పులు వచ్చాయి... నాస్తికులలో కూడా గ్రంథ పఠన... విమర్శనాశక్తి పెరిగిపోయాయి. దొంగలెవరో...దొర లెవరో... దొరల్లో దొంగలెవరో "ఒరుపు" వేసే మనస్తత్వం పెరిగింది యువతి యువకులలో.

పిల్ల లిద్దరూ బాగా పెరిగారు.

కానీ, అస్తమానూ "దర్శనాలు" "పాద పూజలు" "భైరవి అలంకరణ" ఇతర (గొప్ప) భక్తులను ఉద్ధరించే నిమిత్తం కార్లలో చేసే "సంచారం" - ఇలాటి గొడవలో పడిపోయిన భైరవి గానీ ఆమె "బిడ్డ" (భర్త)గానీ స్వంత బిడ్డలను గురించి ఆలోచించే టైము లేకపోయింది.

పెద్దవాడు థర్డ్‌ఫారమ్ వరకూ పల్టీలు కొడుతూ చదివి... చదువు ఆపేశాడు. చిన్నవాడు ఐదో క్లాసుతోనే స్వస్తి చెప్పాడు. ఇద్దరికిద్దరూ బీడీలు, సిగరెట్లు తెగకాలుస్తున్నారు... దర్జాగా డ్రెస్సులువేస్తూ... డబ్బు మంచినీళ్ళలా ఖర్చుపెడుతున్నారు... రౌడీ వెధవలతో తిరుగుతూ... జులాయిగా తయారయ్యారు...

ఎవరేనా ఇంట్లో పెద్దలు మందలించబోతే... పెద్దవాడు పూనకం వచ్చినట్లు ఊగుతూ "నేను ఆంజనేయస్వామిని నాకు అడ్డుచెబితే... మిమ్మల్ని సర్వనాశనం చేస్తాను!" అంటున్నాడు... చిన్నవాడు "నేను సుబ్రహ్మణ్యేశ్వరుడిని! నా జోలికి వచ్చారో...చచ్చారే!" అంటున్నాడు...

దేవత పిల్లలు విధిగా దేవుళ్ళై తీరుతారన్న నమ్మకం ఎవరికీ లేకున్నా... ఎవరికివారే "మనకెందుకు?" అన్న ధోరణిలో వాళ్ళిద్దరినీ పట్టించుకోవటం లేదు.

భైరవి భర్తకూ భైరవికీ ఇదో దిగులు పట్టుకుందీమధ్య... ఈ పిల్లలిలా తయారయ్యారేమిటి? వీళ్ళు తాము దేవుళ్ళంటే నమ్మేదెవరు? జులాయిగా... డబ్బంటే లక్ష్యం లేకుండా వున్న వీళ్ళకు... ఈ తరగని సంపద ఇచ్చినా నిలుపుకోగలరా?

దానికితోడు జనంలోకూడా "వెర్రి

మూర్ఖం" తగ్గింది... ఇదివరకులా పొర్లుకొని రావటంలేదు... భక్తిమాట అలా వుంచి భయం కూడా లేకుండా పోతోంది భైరవి పట్ల. దర్శనాల రద్దీ తగ్గుతోంది. ఆశ్రమంలో కూడా అవకతవకలు జాస్తయ్యాయి. ప్రధాన శిష్యులూ, శిష్యురాళ్ళ పెత్తనంలో ఆశ్రమంలో ఆశ్రితపక్షపాతం... తమకు గిట్టనివారిపట్ల అనాదరణ...చిన్న చిన్న దొంగతనాలు జాస్తయినాయి... అదే మంచే... కొందరు చాటు చాటుగా ప్రసాదరావును నిలవేస్తున్నారు... "అంత బంగారమూ... డబ్బూ... కానుకలూ నువ్వు దాచుకోగా... మేం నాలుగు కిలోల బియ్యం తీసుకొంటే తప్పా ?" అంటూ. తీగె కదిపితే . డొంకంతా కదులుతుందని... వేరేదారి లేక వూరుకొంటున్నాడు.

"భార్గవీ! ఈమధ్య ఇక్కడొకామె.. నీలానే... తనలోకి రాజరాజేశ్వరీదేవి వస్తోందని చెప్పి... పిచ్చి జనాన్ని ఆకట్టుకుంటోంది. అంతటితో ఆగక... తనే మహిషాసురమర్దని కనకదుర్గననీ... చెప్పేస్తోంది... ఓ అట్టలతో చేసిన చెక్క సింహంమీద కూర్చుని... అభయ ముద్ర పట్టి... చేతిలో త్రిశూలంతో— ఫొటో తీయించుకొని... ఇంటింటికీ పంచుతోంది... తనే దేవతగా పూజించమని ! ఇంతటి అహం... దైవాన్ని ధిక్కరించే ఈ చర్య... ఎంతటి పతనానికి హేతువో ఆవిడకు అర్థం కావటంలేదు...

నాకు నవ్వొస్తోంది...చెక్క సింహం మీదకూర్చున్న ఈమె రాజరాజేశ్వరీదేవి అయితే... సర్కస్‌లో రింగ్‌మాస్టర్ దేవ దేవుడు కాడా ? ఆత్మవిశ్వాసం, ధైర్యం ఆయుధాలుగా చేసుకుని, నిజం పులులన్నూ, సింహాలనూ తన చుట్టూరా వుంచుకొని నిర్భయంగా నిల్చుండే ఆ రింగ్‌మాస్టర్ తాను దేవుణ్ణని... దేవ దేవుణ్ణని ఏనాడూ చెప్పుకోగా వినలేదు మనం ఎవరమూ! ఈ డూప్లికేటు దేవతలకు మొక్కేకంటే...ఆ రింగ్‌మాస్టర్‌ను మెచ్చుకోవటం మంచిది కాదా ?

నీవూ ఇలాటి పిచ్చివేషాలలోకి దిగుతావేమోనని ముందుగానే వ్రాస్తున్నాను..."

అంటూ ఉత్తరం రాసింది లలిత... అవును... కాదు అనలేకపోయింది భార్గవి...

వాతావరణం మారిందని పసికట్టాడు. భైరవి భర్త. బలవంతపు దర్శనాలు సాగించటంకంటే, ఇది ఆపి... భైరవి "శాశ్వతమౌనం నిశ్చల సమాధి" పేరుతో తెరమరుగున వుండటమే మేలని పించింది...

భైరవికి అనారోగ్యం ముంచుకవచ్చింది... ఇదీ ఒకందుకు మంచిదేనను కున్నారు ఇద్దరూ. .కొంతకాలంపాటు... అజ్ఞాతవాసానికి అలవాటు పడేందుకు ఇది ఉపకరించవచ్చు... మారుమూల పద్మావతీ ప్రైవేటు నర్సింగ్‌హోం అయితే అన్నివిధాలా అనుకూలంగా వుంది. అక్కడ చేర్చాడు భైరవిని...

"భైరవీజీ ! మీకూ! మీకే కాదు... మీలాటి చాలామందికి, దేవుడూ లేదు... దెయ్యం లేదు. మొదట్లో అదొరకమైన నరాల బలహీనత. హిస్టీరియా సంబంధమైన జబ్బు... అది తెలుసుకోలేక దేవుడంటూ దెయ్యమంటూ రభసచేసి, పిచ్చి జనాన్ని అట్రాక్ట్‌చేసి దోచుకోవటం మొదలెడతారు ! తమకేదో ప్రత్యేకత రావాలన్న "సబ్‌కాంషస్"లో ప్రారంభమయే "సైకలాజికిల్ అర్జ్" ఇది. ఇది తెలియజెప్పే నాధుడులేడు.ఆ ధైర్యమూ లేదు చాలామందికి ! అంది నిన్న సాయంత్రం పద్మజ... భైరవితో.

"పిచ్చిపిల్లవమ్మా!"అంది భైరవి... మరేమనాలో తోచక...

"కానండోయ్! నేను మీలాటి వాళ్ళని స్టడీ చేస్తున్నాను... ఎప్పుడో మన దేశంలో ప్రబలుతున్న ఈ డూప్లికేట్ దేవతలమీద ఓ గ్రంథం వ్రాసిపారేసి... డాక్టరేట్ కొట్టేయ్యాలని వుంది ?" అని వెళ్ళిపోయింది నవ్వుతూ.

లలిత ధోరణీ అదే !

* * *

ఒక్కసారిగా గాలి స్తంభించిపోయినట్లైంది. కరెంటుపోవటంవల్ల... ఫాన్ ఆగిపోయింది. భైరవికి శరీరమంతా చెమటలు పట్టింద. గతమంతా చెదిరి వర్తమానం స్థిరంగా నిలిచింది కళ్ళ ముందు.

ఇకముందు తను దేవతగా...భైరవిగా పూజలందుకొనే అవకాశం లేదు. పోనీ... అందరిలా మామూలుగా బ్రతికే మార్గమూ లేదు... తను "మనుషులలో" కలవదల్చుకున్నా... మనుషులెవరూ తనను "మనిషి"గా కలుపుకోరు. బలవంతపు మౌనవ్రతంలో, అజ్ఞాత వాసం గడపవలసిందే! తన మోసం... తన భర్త మోసం... ఈ నాటికి పండిపోయాయి !

"నీలోకి నువ్వు చూచుకో!"ఎవరిదో గొంతు. ఆ యువకుడిదా? లలితదా? పద్మజదా? తనదేనా ?

"లలితా! నిజం! నువ్వు రాసింది నిజం! ఏనాడూ నాలోకి నేను చూచుకో లేదు నేను ! నేను నిజంగా దేవతను కాను. దెయ్యాన్ని కాను... మామూలు మనిషిని! మీలాటి మనిషిని!... మనిషినీ కాను. ఓడొల్లను... భైరవి ఉన్మత్తురాలిలా లేచింది. గదిలో పిచ్చిదానిలా పచారుచేస్తోంది. ఇక తనెంతకాలం బ్రతికినా... ఇలాగే మరో గదిలో... ఆజన్మఖైదీలా... త్రిశంకు స్వర్గంలో బ్రతకవలసిందేనన్న ఊహ, ఆమెని ఆపాదమస్తకం వణికిస్తోంది. "నేను ఆంజనేయస్వామిని...నేను సుబ్రహ్మణ్యేశ్వరుణ్ణి" అంటున్న కొడుకుల గొంతులు వినిపించాయి... ఉలిక్కిపడింది...

"మీరు దేవుణ్ణిచూశారా ?" ఆ యువకుడి ప్రశ్న!

గదంతా గిర్రున తిరుగుతున్నట్టుంది ...వందలాది అలాంటి యువకులూ, వేలాది లలితలూ, లక్షలాది పద్మజలూ ...తనని వేయికళ్ళతో పరీక్షించిచూస్తూ ప్రశ్నిస్తున్నట్లు... ఒకటే హోరు... పిచ్చిదానిలా బెడ్‌మీద కూర్చొనివుంది భైరవి... కాదు భార్గవి.